



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 8 సంచిక : 344

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 27 ఏప్రిల్ 2025

## అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,కలంకౌంటర్ :** సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. "రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు" రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి.



బహుళత్వం– వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నీటిపారుదల ఆధునికరణ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,కలంకౌంటర్ :** కృత్రిమ మేధస్సు, డ్రోన్లు,జియోగ్రాఫిక్ సమాచారంతో పాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నీటిపారుదల రంగాన్ని ఆధునికరించ నున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రోజున రాష్ట్ర రక్షా విశ్వవిద్యాలయంతో కలసి నిర్వహించిన కృత్రిమ మేధస్సు & డ్రోన్ అంశంపై హైటెక్స్ లో జరిగిన డ్రోన్ ఎక్స్పో సదస్సు 2025 కార్యక్రమానికి




ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు సుస్థిరమైన గ్రామీణాభివృద్ధిని ప్రోత్సాహించదానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుం దన్నారు కృత్రిమ మేధస్సు ఆధారిత డ్రోన్ అప్లికేషన్లు తదితర అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో మౌళిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. నీళ్లు, భూమి మేనేజ్మెంట్ శిక్షణ పరిశోధన సంస్థను (వాలంటరీ) బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆధునిక నీటి నిర్వహణ సాగునీటి పద్దతులపై పరిశోధనలో ఈ శిక్షణా కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోబోతున్నామన్నారు. కేవలం వాలంతరిని మౌలిక సదుపాయాల వరకే పరిమితం చెయ్యకుండా నిరంతర అధ్యయనం, పరిశోధనలకు అనువైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు డ్రోన్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. పంటలను పరిరక్షించడంతో పాటు సారవంతమైన భూములను గుర్తించడం, సాగునీటి నిర్వహణలో సరికొత్త మేలుకవలు గుర్తించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించ నున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష..





**అమరావతి,కలంకౌంటర్ :** మే 2వ తేదీన అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు అమరావతి రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడి పర్యటన ఏర్పాట్లపై శనివారం రాష్ట్ర సచివాలయం వెనుక ఏర్పాటు చేస్తున్న సభా వేదిక ప్రాంగణంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ సంబంధిత నోడలు అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఈసందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ వివిధ టాస్కులు కేటాయించిన అధికారులు ఆయా పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.టెంటటివ్ కార్యక్రమం ప్రకారం ప్రధాని మోడి మే 2న మధ్యాహ్నం 3గం.లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయానికి చేరుకుని 1.4కి.మీల మేర రోడు? షో ద్వారా సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు.తదుపరి సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునః ప్రారంభానికి శంఖుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు.సభ అనంతరం సా.5.గం.లకు సభా ప్రాంగణం నుండి హెలీకాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ బయలు దేరుతారని చెప్పారు.ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేయడం జరుగుతోందని, వాహనాలు పార్కింగ్ కోసం 9 పార్కింగ్ స్థలాలను గుర్తించి అక్కడ తాగునీరు,ఆహారం, మరుగుదొడ్లు వంటివి వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ వేగవంతుగా పూర్తి చేయాలని వివిధ టాస్క్లు కేటాయించిన అధికారులను వీరపాండ్యన్ ఆదేశించారు.ఈనెల 30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రధాని సభకు వచ్చే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆహారం అందించడం జరుగుతుందని ఇందుకు సంబంధించి ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంకా పలు ఏర్పాట్లకు సంబంధించి ఆయా నోడలు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈసమావేశంలో అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని సభకు 100 మందికి పైగా వివిఐపిలు, 15 మంది వరకు ఎంఐపిలు, 5వేల మంది వరకు విఐపిలు రానున్నారని అందుకు అనుగుణంగా పార్కింగ్ ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు.పార్కింగ్ ప్రాంతంలో నిరంతరం మైక్ అనౌన్స్మెంట్ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ డ్యూటీ పాస్లుకు సంబంధించి ఆయా శాఖలు వెంటనే జాబితా ఇవ్వాలని కోరారు. ఇంకా ఈసమావేశంలో ఐజి శ్రీకాంత్,గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, సియుం త్రివిక్రమ్ వర్మ,పలువురు పోలీసు ఉన్నతాధికారులు, నోడలు అధికారులైన పలువురు ఐఏఎస్,ఐపిఎస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలసీలతో పైకొచ్చిన వారు పేదలకు చేయూతనివ్వాలి -సీఎం చంద్రబాబు నాయుడు






**ఎచ్చెర్ల,కలంకౌంటర్ :** ప్రభుత్వ పాలసీలతో ఆర్థికంగా పైకొచ్చిన వారు సమాజంలోని పేదలకు చేయూతనిచ్చి అన్ని విధాలా వారిని అభివృద్ధి చేసేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల నియోజకవర్గం, బుడగట్లపాలెంలో మత్స్యకారుల సేవలో పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రజావేదిక సభలో జీరో పావర్టీ–పీ4 కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 'రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలి. పేదలకు ప్రభుత్వ పథకాలు అందివ్వడమే కాకుండా మార్గదర్శుల ద్వారా సాయం అందించి అన్ని విధాలా పైకి తీసుకొచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మార్గదర్శులు దత్తత తీసుకున్న కుటుంబాలకు ఏం చేస్తున్నాయో కూడా సమీక్ష చేస్తాం. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నది నా లక్ష్యం. అన్ని విధాలా ఆర్థికంగా పైకొచ్చిన వారు పేద కుటుంబాలను ఆదుకుంటే సమాజంలో అసమానతలు ఉండవు.' అని సీఎం చంద్రబాబు అన్నారు. అనంతరం మార్గదర్శు లకు సీఎం చంద్రబాబు శాలువాలు కప్పి సన్మానం చేశారు. బంగారు కుటుంబానికి ఎంపికైన వారు మాట్లాడుతూ.... అలుపు లచ్చమ్మ : నా భర్త ఉపాధి కోసం గుజరాత్ వెళ్లారు. నేను ఇంటి వద్దే ఉంటూ పిల్లల్ని చూసుకుంటాను. మాది పేద కుటుంబం. సూరాడ అప్పన్న : మా అమ్మనాన్న లేరు. మా అక్కకు 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. కానీ రెండేళ్లకే మానసిక సమస్యను ఎదుర్కోవడం వల్ల ఆమెను భర్త వదిలేశారు. ప్రస్తుతం ఆమె, పిల్లలు మా వద్దే ఉంటున్నారు. నా భార్య బీఎస్సీ కంప్యూటర్ చేసింది. నేను, నా తమ్ముడు వేటకు వెళ్లి మా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. 8 మందిమి కలిసి ఒకింట్లో

- 2లో




## రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి : రాహుల్ గాంధీ



**హైదరాబాద్,కలంకౌంటర్ :** గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు.



## శ్రీ అమ్మవారిని దర్శించిన హైకోర్టు రిజిస్ట్రార్



**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవిఎస్ బిజీ పార్థసారథి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం తరపున వేద ఆశీర్వచనం జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశామని ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## వేసవి నుండి ఉపశమనానికి ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ పంపిణీ

- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్






**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేస్తున్న 80మంది ట్రాఫిక్ పోలీసులకు దాతల సహకారంతో సమకూర్చిన బ్యాగు, హ్యాట్ , వాటర్ బాటిల్ తో కూడిన సమ్మర్ కిట్స్ ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – వేసవి కాలంలో మండు టెండలో ట్రాఫిక్ విధులు నిర్వహించడం చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వేసవిలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసుల పని గంటలను తగ్గించడంతోపాటు, కొన్ని పాయింట్లను రద్దు చేసామన్నారు. యూనిఫామ్ ధరించి, విధులు నిర్వహించే పోలీసుల పని తీరును ప్రజలు ఎప్పుడు గమనిస్తుంటారన్నారు. పోలీసులు సక్రమంగా విధులు నిర్వహిస్తే, పోలీసుల పని తీరును ప్రజలు ప్రశంసిస్తారని, అదే విధంగా విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తే, చెడ్డ పేరును పోలీసు వ్యవస్థ మొత్తానికి ఆపాదిస్తారన్నారు. కావున, విధులు నిర్వహించే సమయంలో పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని, చక్కని పని తీరుతో పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకొని రావాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. వేసవిలో తీవ్ర ఎండల నుండి కాస్తా ఉపశమనం పొందడానికి దాతల సహకారంతో సమకూర్చిన హ్యాట్స్, వాటర్ బాటిల్, బ్యాగుతో కూడిన సమ్మర్ కిట్స్ను ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే, ఎఎస్ఐలు, హెచ్సీలు, కానిస్టేబుళ్ళు , హెూంగార్డులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అందజేసారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బీ సిఐ ఎవి లీలారావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ట్రాఫిక్ ఎస్ఐలు శంబంగి రవి, ఎస్.భాస్కరరావు, ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ







**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ నిర్వహించారు.

# 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ ఏర్పాట్లు

- 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం
- 500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక
- 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు
- 10 లక్షల వాటర్ బాటిళ్లు
- 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు
- పరిసరాల్లో 12 వైద్యశిబిరాలు
- 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు
- పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వాలంటీర్లు

**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ కు 25 సంవత్సరాలు నిండాయి. 2001లో ఏర్పడి 2014లో రాష్ట్రాన్ని సాధించే దాకా పుట్టినగడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని పోరాటాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన తరువాత పదేండ్ల పాటు సుపరిపాలన అందించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది. 17 నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కేవలం 2.05% ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, స్వల్ప కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పదిహేడు నెలల నుంచి అద్భుతంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. లగచర్లలో గిరిజన రైతులపై కాంగ్రెస్ చేసిన దాష్టికాలను యావత్ దేశం దృష్టికి తీసుకుపోవడంలో బీఆర్ఎస్ విజయవంతం అయింది. మూసీ, హైడ్రా బాధితులకు అండగా నిలబడింది. మొన్నటి హెచ్.సి.యూ విద్యార్థుల పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి 400 ఎకరాల పచ్చటి అటవీ భూమిని కాపాడుకుంది. అక్కడి వన్యప్రాణులకు నిలువ నీడ లేకుండా చేయాలనుకున్న రేవంత్ ప్రభుత్వ దమనకాండను దేశం ముందుంచింది. త్యాగాల పునాదుల మీద అవతరించిన తెలంగాణను ఖతం పట్టించాలనుకుంటున్న కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కుంటూనే తన 25 ఏండ్ల రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ రెడీ అయింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన తెలంగాణ ప్రజల ఇంటిపార్టీ బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించబోతున్నారు. లక్షలాదిగా తరలివచ్చే జనానికి అందుకు తగ్గట్టుగానే తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ పార్టీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మహాసభ ప్రాంగణాన్ని 154 ఎకరాల్లో సిద్ధం చేసింది. 500 మంది కూర్చునేలా గులాబీ రంగులతో వేదికను తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట-పాట కోసం ప్రత్యేకంగా మరో స్టేజ్ ను ఏర్పాటుచేశారు. ఇక ఎల్కతుర్తికి వచ్చే అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముండ్ల చెట్లను తొలగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు. ఇక సభకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి దాదాపు 50 వేల వాహనాల వస్తాయని అంచనా వేస్తున్నారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించారు. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్షకుపైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు. మరికొన్ని ఏర్పాట్లు 6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు 1,200 టెంపరరీ మరుగుదొడ్ల ఏర్పాటు 10 లక్షల వాటర్ బాటిళ్లు 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వలంటీర్లు

# అణగారిన వర్గాల ఆశా కిరణం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్

- అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి మండిపల్లి







**మడకశిర,కలంకౌంటర్ :** అణగారిన వర్గాల ఆశా కిరణం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మడకశిర పట్టణంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే రాజు మరియు ఎమ్మెల్సీ తిప్పే స్వామితో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నందు అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకు వెళ్ళాలని, ఆయన మార్గం అందరికీ అనుసరణీయమన న్నారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ఆయన రాసిన రాజ్యాంగం విలువల ఆధారంగా స్వాతంత్రాన్ని పొందగలిగాయన్నారు. మన దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిలబడటానికి ప్రధాన కారణం ఆయన రాసిన రాజ్యాంగమే అని, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా ఎప్పటికి నిలిచిపోయిన మహనీయుడన్నారు. అట్టడుగు వర్గంలో జన్మించి ఎన్ని అవాంతరాలు ఎదురొచ్చినా ఉన్నత చదువులు చదివిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. నేటికీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే దేశం నడుస్తోందన్నారు. దేశ భవిష్యత్ అవసరాలను ముందే ఊహించి, వాటి పరిష్కార మార్గాలను రాజ్యాంగంలో పొందుపరిచిన దాస్నికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అంతకుముందు మంత్రి. ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఎమ్మెల్యే రాజు కలిసి డప్పు వాయించారు.

# శ్రీసిటీని సందర్శించిన సెజ్ ల మార్గదర్శకుల బృందం

- దేశానికి ఉత్తమ నమూనాగా శ్రీసిటీకి ప్రశంస



**తిరుపతి,కలంకౌంటర్ :** సెజ్ పాలసీ లక్ష్యాలకు ధీటుగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్ ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భ ంగా ఈ సందర్శన చోటుచేసుకోవడం ప్రత్యేకతను సంత రించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర పలు ప్రత్యేకతలను వారికి వివరించారు. శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సెజ్ పాలసీ మార్గదర్శ కులు శ్రీసిటీ పర్యటనకు రావడం తనకు ఆనందంగా, గర్వ ంగా ఉందని వ్యాఖ్యానించారు. శ్రీసిటీ స్థాపన సమయంలో వారు అందించిన విశేష ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞ తలు తెలిపారు. ఆ సమయంలో వారితో తన అనుబం ధాన్ని నెమరువేసుకున్నారు. 2005 ప్రత్యేక ఆర్థిక మండ లాల చట్టం అమలులో అప్పటి కేంద్ర వాణిజ్య కార్యదర్శి జి.కె.పిళ్లై ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన హయాంలో 325 ల ఏర్పాటుకు మార్గం సుగమం కాగా, తద్వారా భారతదేశ ఎగుమతి పర్యావరణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. సెజ్ ల రూపంలో దేశ ఆర్థిక ప్రగతికి బాటలు పడ్డాయన్నారు. శ్రీసిటీతో ఎంతో అనుబంధం కలిగిన ప్రముఖ వ్యక్తుల రాక, సొంత ఇంటికి వచ్చిన భావన కలిగిస్తోందన్నారు. వారి పరిశీలన లు, సూచనలు తమకు మరింత ప్రేరణ కలిగిస్తాయన్నారు. అతిథులతో అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు.బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురిచేసిందన్న పిళ్ళై, ఈ సందర్శన తనకెంతో ఆనందం కలిగించిందన్నారు.

# ప్రభుత్వ పాలసీలతో పైకొచ్చిన వారు పేదలకు చేయూతనివ్వాలి -సీఎం చంద్రబాబు నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్నాం. మా అక్కకు పెన్షన్ ఇప్పించిండి.

**సీఎం :** మీ సోదరికి వెంటనే పింఛన్ అందిస్తాం. ఇల్లు నిర్మిస్తాం. మార్గదర్శులు మాట్లాడుతూ....

**గురిపూడి శ్రీరామ మూర్తి :** నేను ఉపాధ్యాయుడిగా పని చేసి రిటైర్డ్ అయ్యాను. ఈ ప్రాంతంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులతో కాలేజీ పెట్టాం. రాష్ట్ర ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం పెరిగితే మరింత అభివృద్ధి చెందుతుందని సీఎం చంద్రబాబు ఆలోచన. నేను 25 కుటుంబాలను దత్తత తీసుకుంటాను. అప్పన్న ఇంట్లో కంప్యూటర్ ఏర్పాటు చేసి ఆయన భార్యకు నైపుణ్యం పెంచి మా వ్యవసాయ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా, ప్రోగ్రామర్‌గా అవకాశం కల్పిస్తాం. వారి పిల్లలను మా కాలేజీలో ఉచితంగా చదివిస్తాం.

**పీవీఎస్ రామ్మోహన్ :** నేను కూడా సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చాను. 1995-2004 మధ్య సీఎం చంద్రబాబు ఐటీ స్కిల్ డెవలెప్మెంట్ కార్యక్రమం చేపట్టారు. మేము అబ్రాడ్‌లో కంపెనీ పెట్టాం. 2018లో పైడి భీమవరంలో హెల్త్ కేర్ ఇండస్ట్రీ పెట్టాం. కోవిడ్ సమయంలో మా పరిశ్రమ ద్వారా ఆక్సిజన్ అందించాం. చంద్రబాబుకు మేం రుణపడి ఉన్నాం. మా పరిశ్రమ తరపున లచ్చమ్మ కుటుంబానికి సాయం అందించడంతో పాటు 20 కుటుంబాలను దత్తత తీసుకుంటాం. మత్స్యకారులకు టూల్ కిట్స్, బోట్స్, వారి పిల్లలకు చదవును అందించడంతో పాటు స్కాలర్ షిప్స్ అందిస్తాం.

## కొండలు ఎర్రబడ్డాయి..

నీ వొక చలి దుప్పటి కప్పుకున్నా
మంచు కొండకు నిప్పు పెట్టావు.
ముచ్చటగా ముసి ముసిగా నవ్వుతూ పారుతున్న సెలయెర్లలో
నీ విషం అంటిన కాలి బూట్లను కడిగేశావ్.
ఆ ఆకాశం లో స్వేచ్ఛ గాలిపటం లా వొళ్ళు మరచి విహరిస్తుంటే
నీ క్షుద్ర బుద్ధితో ఇనుప రెక్కల గండ భేరుండాల తో రణరంగం చేశావ్.
కాశ్మీరం లోని గాలి గంధర్వగానం చేస్తూ ప్రవహిస్తుంటే...
జీహాద్ రక్తపు వాగుల్లో దొర్లాడిన నీదేహపు వాసనను ఎందుకు రుచి చూపించావ్.
తియ్యటి చుంబనాలు చేసుకొంటూ ఆదమరచి నిద్రపోతున్న కొండల్లో...
నీ కల్మష కోపాగ్నిలో పుట్టిన గ్రానై డ్ల తో సమాధి గోతులు తవ్వావెందుకు.
స్వర్గ ఖడం లాంటి భారతం తలమీద
ఎక్కడ చూసిన నీ దిష్టి చూపులే
ఎందుకింత క్రూరత్వం..
ఎందుకింత క్షుద్రత్వం..
ఇదుగో... మేం శపిస్తున్నాం..
క్షణం క్షణం నీవు చూపును కో ల్పోతావు
ఏదో రోజు బలముడిగి నేలకు రాలిపోతవ్..
ఇక నీకు నేలపై చోటెక్కడ...?

గాదంశెట్టి. శ్రీనివాసులు
ఉప్పు గుండూరు, ప్రకాశం జిల్లా.

## హైదరాబాద్‌లో హైఅలర్ట్.. నలుగురు పాకిస్తానీయులకు నోటీసులు

**హైదరాబాద్,ఏప్రిల్ 26 (వార్తాప్రభ) :** జమ్మూకశ్మీర్ లోని పహల్గాం లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు భారత్‌లో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అన్ని రాష్ట్రాల సీఎంలకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా ఫోన్ చేసి రాష్ట్రంలో ఉన్న పాకిస్తానీలను వెంటనే గుర్తించి వెనక్కి పంపాలని ఆదేశించారు. అదేవిధంగా వారి కంప్లీట్ డేటాను కేంద్రానికి పంపితే వారి వీసాల రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ఉన్న పాకిస్తానీయులపై తెలంగాణ పోలీసులు ఫుల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు ఇవాళ నగరంలో ఉంటున్న నలుగురు పాకిస్థాన్ పౌరులకు నోటీసులు కూడా జారీ చేశారు. వారిని షార్ట్ టర్మ్ వీసా హెూల్డర్లుగా గుర్తించారు. రేపటిలోగా హైదరాబాద్‌ను విడిచి వెళ్లాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్ మహా నగరంలో 213 మంది పాకిస్తానీయులు ఉన్నట్లుగా తేలింది. అందులో లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నవారు 209 మంది ఉన్నారు. అయితే, లాంగ్ టర్మ్ వీసాలు ఉన్న వారికి మాత్రం కేంద్రం మినహాయింపునిచ్చిన విషయం తెలిసిందే.







జంగారెడ్డిగూడెం లో పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి బోసు బొమ్మ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి,మానవహారం గా ఏర్పడ్డారు.కాశ్మీర్ రాష్టంలో ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

–జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :

## మహమ్మద్ సుభాని కి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ చేతుల మీదుగా 35 వేలు ఆర్థిక చేయూత




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మహమ్మద్ సుభాని కి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ చేతుల మీదుగా 35 వేలు ఆర్థిక చేయూత ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ముస్లిం మైనార్టీ దంపతులైన సుభాని జరినాలకు నవ మాసాలు నిండకుండానే పాప జన్మించగా వైద్యులు ఉన్నతమైన వైద్యం అందించాలని తెలిపారని అన్నారు . తాపీ పని చేసుకునే సుభాని శక్తికి మించి అప్పులు చేసి లి3లక్షలు వరకు ఖర్చుపెట్టారని. తమ పాప ప్రాణాలను కాపాడాలని దాతల సహాయాన్ని కోరిన సుభాని జరీన దంపతులకు మైత్రి ఫౌండేషన్ అండగా నిలిచి దాతల సహాయాన్ని సేకరించి లక్ష రూపాయలు అందించారని రామకృష్ణ అన్నారు.మైత్రి ఫౌండేషన్ ద్వారా విషయం తెలుసుకున్న ఎన్ ఆర్ ఐ చలమలశెట్టి బాలాజీ ప్రవాసాంధ్ర జనసేన పార్టీ టీం నుండి లి30వేల ,500రూ సేకరించగ తన వంతు సాయంగా 4,500 జతచేసి "35 వేల రూపాయల"లినగదును నవజాత శిశువు వైద్యం కొరకు తండ్రి లిమహమ్మద్ సుభాని కి అందజేశామని తెలిపారు.నిరుపేద ముస్లిం మైనార్టీ కుటుంబానికిలి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరున బండి రామకృష్ణ ధన్యవాదాలు తెలుపుతూ నవజాత శిశువు పరిపూర్ణమైన ఆరోగ్యంతో కోలుకుంటుందని దిగులు చెందవద్దని సుభాని జరీనా దంపతులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు,జనసేన పార్టీ డివిజన్ ఇన్చార్జిలు రామినాయుడు, ఉడుములబుజ్జి,వడ్డీచిరంజీవితిరుమలశెట్టిరాజు, నరహరశెట్టి రామ్ జ్యోతి, తోట రాజేష్, చలమలశెట్టి శ్రీనివాస్, తోట భాస్కర్, ఏరువ శ్రీనివాస్, చలమలశెట్టిరమేష్, మైత్రి ఫౌండేషన్ సభ్యులు జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన జిల్లా పోలీస్ అధికారులు..

● సరైన ధ్రువపత్రాలు లేని 72 వాహనాలు సీజ్ ● జిల్లా ఎస్పీ తుషార్ డూడి







**బాపట్ల,కలంకౌంటర్ :** చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చెయ్యడమే లక్ష్యంగా జిల్లాలో కార్డెన్ అండ్ సెర్చ్ లు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం వేకువ జాము నుండి ఉదయం 8 గంటల వరకు చీరాల, రేపల్లె సబ్ డివిజన్ లలో కార్డెన్ అండ్ సెర్చ్ లు జరిగాయి. చీరాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, న్యూ కాలనీ లలో, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లటూరు గ్రామ ఎస్.సి కాలనీలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చీరాల డిఎస్పి మోయిన్ ఆధ్వర్యంలో చీరాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, న్యూ కాలనీ లలో శనివారం ఉదయం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింద న్నారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ లో చీరాల 1 టౌన్, 2 టౌన్, రూరల్, ఇంకొల్లు, అద్దంకి సర్కిల్ సిఐలు, చీరాల 1 టౌన్, 2 టౌన్, ఈపూరుపాలెం, వేటపాలెం, ఇంకొల్లు, మేదరమెట్ల ఎస్సైలు సబ్ డివిజన్ పరిధిలోని 150 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 33 అనుమానిత ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నాటుసారా తయారీకి భూమి లోపల గుంతలు తీసి డ్రమ్ములలో నిల్వ ఉంచిన 5,000 లీటర్ల బెల్లపు ఊటను వెలికి తీసి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లటూరు గ్రామ ఎస్.సి కాలనీలో నిర్వహించిన కార్డెన్ & సెర్చ్ ఆపరేషన్ లో వేమూరు, చుండూరు, రేపల్లె టౌన్, రూరల్ సిఐలు, భట్టిప్రోలు, చుండూరు, నిజాంపట్నం, చోడాయపాలెం ఎస్ఐ లు సబ్ డివిజన్ పరిధిలోని 72 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని అనుమానిత 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పై రెండు ప్రదేశాలలో జరిగి న కార్డెన్ అండ్ సెర్చ్ లో ఇద్దరు డిఎస్పీ లు, 9 మంది సిఐలు, 11 మంది ఎస్ఐ లు, 222 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని అనుమానిత 72 వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో 65 ద్విచక్ర వాహనాలు, 7 ఆటోలు ఉన్నాయ న్నారు. నాటుసారా తయారీకి డ్రమ్ములలో భూమి లోపల నిల్వ ఉంచిన 5,000 లీటర్ల బెల్లపు ఊటను వెలికి తీసి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా జిల్లాలో చట్టవ్యతిరేక అసాం ఘిక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో, నేరస్తు, అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, నేరాలలో ఉపయోగించిన వాహనాలను, దొంగిలించబడిన వాహనాలను గుర్తించేందుకు కార్డెన్ అండ్ సెర్చ్ లు నిర్వహించడం జరిగిందన్నారు. చెడునడత కలిగిన వ్యక్తుల కదలికల పై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, నాటు సారా తయారీ చేసినా, కలిగి ఉన్న గంజాయి ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన దారులు ప్రతి ఒక్కరు వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాన్ని అనుమానిత వాహనాలుగా పరిగణించి వాటిని సీజ్ చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా నాటు సారా తయారి విక్రయాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన యడల వెంటనే సంబంధిత స్టేషన్ ఎస్. హెచ్.ఓ (లేదా) డయల్ 112/100 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

## ప్రమాదం చెప్పి రాదు! మనమే అప్రమత్తంగా ఉండాలి

● మెరైన్ పోలీస్ ● ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం మండలం, మంగినపూడి బీచ్ నందు వేసవికాలం కావడం వలన వాతావరణంలో పలు మార్పులు జరిగి, సముద్రం లో సుడిగుండాలు ఏర్పడుతున్నాయి, దాని కారణంగా బీచ్ నందు పెద్ద పెద్ద గోతులు , పెద్ద నాలి ఏర్పడినది "(మంగినపూడి నుండి గిరిపురం వైపుగా)" ఇందువలన బీచ్ కీ వచ్చే సందర్శకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా కృష్ణా జిల్లా మరియు మెరైన్ పోలీస్ విభాగ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలి పడిన ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిబ్బందికీ లైఫ్ జాకెట్, లైఫ్ బోయ మరియు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా సందర్శకులకు తెలియజేస్తూ ప్రత్యేక పహారా ఏర్పాటు చేయడం జరిగింది మరియు సముద్ర స్నానములకు వచ్చిన సందర్శకులకు విహారయాత్రకు వచ్చిన వారు వినోదం పొందాలి గాని విషాదాన్ని కాదు అని ప్రత్యేకించి యువత కన్నవారికి కడుపుకోత మిగిల్చవద్దని అత్యుత్సాహం ప్రాణాల మీదకు వస్తుందని, ఎవరికి వారు వ్యక్తిగత శ్రద్ధ చూపించి, పిల్లలు మరియు వాహనాలు, డబ్బు బంగారం గుర్తు తెలియని వ్యక్తులకు అప్పగించరాదు అని తెలియజేసినారు ఈ కార్యక్రమమ-ంనకు గిలకలదిండి ఇన్స్పెక్టర్ కే.వంశీకృష్ణ, ఎస్ఐ లు వి.జె.చంద్ర బోస్, పరింకాయల.మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకారులకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వం - ఎంపి బాలశౌరి

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భ్రుతి 10 వేల నుండి 20 వేలకు పెంచుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ముదావహమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు అంటే 61 రోజులపాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా ఇంటికే పరిమితం కావలసి ఉంటుందని, ఆ సమయంలో మత్స్యకారుల జీవనం కోసం, వారి కుటుంబాలకు ఇచ్చే భ్రుతి ని రెట్టింపు చేస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు లబ్ది చేకురుస్తున్నారని అయన అన్నారు. కృష్ణా జిల్లాలో మొత్తం 13077 మంది మత్స్యకార కుటుంబాలకు 26.15 కోట్లు ఈరోజున జమచేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా, మత్యాకరులకు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో 20 వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తం గా మొత్తం 258 కోట్లు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లలో చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే 2014-19 మధ్య కాలంలో మత్స్యకారులకు వలలు, పడవలు ఐస్ బాక్సులు రాయితీలపై ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సి ఎస్ ఆర్ నిధులతో నాగాయలంక మండలం గుల్లల మొదలో 6 కోట్ల రూపాయల వ్యయంతో జెట్టిల నిర్మాణం, ఫిష్ డ్రై ప్లాట్ ఫారంలు . ఆరోగ్య కేంద్రం, రెండు పెద్ద మర పడవలు, చేపల రవాణా నిమిత్తం ఒక వాహనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఇప్పటికే ONGC వంటి సంస్థల సహకారంతో మత్స్యకారులకు ఐస్ బాక్సులు అందచేశామని తెలిపారు. చేపల వేట సమయంలో మత్స్యకారులు మరణిస్తే 10 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నారని, వేటకు వెళ్ళే మర పడవలకు 3 వేల లీటర్లు,( మోటార్ బోట్లకు 300 లీటర్ల చొప్పున ) లీటర్ కు 9 రూపాయల చొప్పున డీజల్ రాయితీ ఇస్తున్నారని అన్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉండే మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో అవనిగడ్డ నియోజక వర్గంలో నాగాయలంక, కోడూరు మండలాలు, పెడన నియోజక వర్గంలో పెడన, బంటుమిల్లి, కృతివెన్ను మండలాల లోని మత్స్యకారులు ఇలాంటి ప్రభుత్వ చర్యల వలన ఆర్ధికంగా నిలదొక్కు కుంటారని ఎంపి బాలశౌరి వివరించారు.

## ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఈనెల 28వ తేదీ నుండి జూన్ 6 వతేదీ వరకు 45 డివిజన్ ఈడేపల్లి శాఖ గ్రంథాలయ%శీ% నందు విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ ద్వారా ఇచ్చే కరపత్రాలను కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ శనివారం సిడింబి అగ్రహారంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు 40 రోజులు పాటు మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఉచితంగా వేసవికాలం సెలవులలో విద్యార్థుల కోసం, డ్రాయింగ్ నేర్పించడం, హ్యాండ్ రైటింగ్ నేర్పించడం, శ్లోకాలు నేర్పించడం, కథలు చెప్పించడం, కరాటే నేర్పించడం, జనరల్ నాలెడ్జ్ చెప్పించడం, క్రాఫ్ట్ వర్క్, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు చదివించడం లాంటి అనేక అంశాలు ఈడేపల్లి గ్రంథాలయ శాఖ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ ఇప్పించడం జరుగు తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు వేసవిలో సెలవులను వృధా చేసుకోకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దుకోవాలి అన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను సెల్ ఫోన్స్ తో కాలాన్ని వృధా చేసుకోనివ్వకుండా ఇటువంటి శిక్షణ శిబిరాలకు పంపించే బాధ్యత తీసుకోవాలి అన్నారు. ఈ శిక్షణ శిబిరాల అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు , సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. కావున విద్యార్థినీ విద్యార్థులు ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణకు వచ్చేవారు తమ పేర్లను నమోదు చేసుకుని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినీ విద్యార్థులను గొర్రెపాటి గోపీచంద్ కోరారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమారు, ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు, శ్రీమతి కోన వెంకటేశ్వరమ్మ, జిల్లా హాస్పటల్ మాజీ చైర్మన్, తలారి సోమశేఖర్, ఎం. వీరభద్రరావు, నూకల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0 లో భాగం గా నాటు సారా నియంత్రణ పేరుతో..



**తిరువూరు,కలంకౌంటర్ :** జిల్లా లో ఎక్కడా లేని విధంగా సామాన్య కిరాణా వ్యాపారులు బెల్లం విక్రయిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని.. తిరువూరు ఎక్సైజ్ సర్కిల్ అధికారులు వ్యాపారులను హెచ్చరించటం తో.. రాష్ట్ర ఛాంబర్ అఫ్ కామర్స్ పిలుపు మేరకు... స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారుల విధానాలను నిరసిస్తూ.. పట్టణ ఛాంబర్ కామర్స్ ఆధ్వర్యంలో కిరాణా మర్చంట్స్ వ్యాపారులు స్థానిక తహసీల్దార్ కె లక్ష్మి కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరు గంగబా బు, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు, ఛాంబర్ అఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు దోసపాటి రవి కుమార్,ఆర్య వైశ్య సంఘం సీనియర్ నాయకులు గజ్జల సీతారామయ్య, ఛాంబర్ కామర్స్ కోశాధికారి దారా రాము, సభ్యులు గుడిమెట్ల జగన్, పరిసే కృష్ణ పాల్గొన్నారు.

## మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి రిమాండ్

**అమరావతి,కలంకౌంటర్ :**మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. సిట్ అధికారులు ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డి మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. కేసులో ఏ6గా ఉన్న ఆయన్ను సిట్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అరెస్టు చేశారు. శనివారం విజయవాడకు తీసుకొచ్చి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. 2019లో వైకాపా అధికారం చేపట్టాక నూతన మద్యం విధానం ముసుగులో నెలనెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు ఎలా కొల్లగొట్టొచ్చనే దానిపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశాలన్నింటిలోనూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పట్లో ఆ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి, నాటి ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌తో కలిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉగ్రవాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీ!

● ఉగ్రవాదాన్ని అణచివేయాలని విజ్ఞప్తి చేసిన డా. కొల్లూరి -





**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** జమ్మూ కాశ్మీర్ ఘటనపై ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పెడనలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. కొల్లూరి చిన్న మాట్లాడుతూ పహల్గాంలో 26 మంది పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులను ఉరితీయాలని పర్యాటకుల ఆత్మ శాంతించాలని గాయపడ్డ పర్యాటకులు త్వరగా కోలుకోవాలన్నారు. భారతదేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయాలని మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాకు పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు డా. కొల్లూరి. ఈ కార్యక్రమంలో వరల్డ్ వైడ్ హ్యూమన్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ పెడన అధ్యక్షుడు చిట్టూరి పశుపతినాథ్ బాబు వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయ దుర్గ ప్రధాన కార్యదర్శి జవాజి మాధవి ఉపాధ్యక్షురాలు కొల్లూరి పద్మ పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# గగనతలం మూసివేసిన పాక్

● ఎయిర్ లైన్స్ కు డీజీసీఏ కీలక మార్గదర్శకాలు ● భారత విమానాలకు పాకిస్థాన్ గగనతలం మూసివేత ● ఉత్తర భారతదేశం నుంచి పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలపై ప్రభావం ● ప్రయాణ సమయం పెరుగుదల ● ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్న డీజీసీఏ ● సౌకర్యాలు కల్పించాలని ఎయిర్‌లైన్స్‌కు ఆదేశం



**న్యూఢిల్లీ , కలంకౌంటర్ :** భారత విమానాలకు పాకిస్థాన్ తమ గగనతలాన్ని మూసివేయడంతో విమానయాన రంగంపై, ముఖ్యంగా ఉత్తర భారతదేశం నుంచి పశ్చిమ దేశాలకు వెళ్లే సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. ప్రయాణ దూరం, సమయం గణనీయంగా పెరగనుండటంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విమానయాన సంస్థలకు, ప్రయాణికుల సౌకర్యార్థం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. పాక్ గగనతలం అందుబాటులో లేకపోవడంతో, విమానాలు ప్రత్యామ్నాయ, సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ సమయం పెరగడమే కాకుండా, ఇంధనం నింపుకోవడానికి లేదా విమాన సిబ్బందిని మార్చడానికి మార్గమధ్యంలో సాంకేతిక విరామం (టెక్నికల్ స్టాప్) తీసుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చని డీజీసీఏ హెచ్చరించింది. ఇలాంటి సమయాల్లో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, పెరిగిన ప్రయాణ సమయానికి అనుగుణంగా విమానాల్లో అదనపు ఆహారం, పానీయాలు, నీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. అత్యవసర వైద్య సదుపాయాలు, సిబ్బంది అప్రమత్తతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించింది. ప్రస్తుతం ఢిల్లీ, అమృత్‌సర్ వంటి ఉత్తర భారత నగరాల నుంచి యూఏఈ, యూరప్, యూకే, ఉత్తర అమెరికా వెళ్లే ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ విమానాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. విమానాలు ఇకపై ముంబై, అహ్మదాబాద్ మీదుగా అరేబియా సముద్రంపై నుంచి మస్కట్ వైపు మళ్లి వెళ్లాల్సి ఉంటుంది. ఈ మార్గంలో బలమైన ఎదురుగాలులు ఉంటాయని, ఇది ప్రయాణ సమయాన్ని మరింత పెంచుతుందని పైలట్లు చెబుతున్నారు. ఈ పరిణామం విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులను పెంచుతుంది. ఇంధన వినియోగం, అదనపు ల్యాండింగ్ ఛార్జీలు, సిబ్బంది ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యంగా సుదూర సర్వీసులు నడిపే ఎయిర్ ఇండియాపై ఆర్థిక భారం అధికంగా ఉంటుంది. పెరిగిన దూరం కారణంగా ఇండిగో కొన్ని అంతర్జాతీయ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ అదనపు ఖర్చుల భారం చివరికి టికెట్ ధరలపై పడే అవకాశం ఉందని, కొత్త బుకింగ్‌లపై ధరలు 30-40 శాతం వరకు పెరగవచ్చని అంచనా. ప్రయాణ సమయం పెరగడం, మార్గమధ్యంలో ఆగడం వల్ల కనెక్టింగ్ ఫ్లైట్లను కోల్పోయే ప్రయాణికుల విషయంలో స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని, నిర్దిష్ట సమయం మించి ఆలస్యమైతే పరిహారం అందించే ఏర్పాట్లు చేయాలని డీజీసీఏ విమానయాన సంస్థలకు సూచించింది. 2019లో బాలాకోట్ దాడుల అనంతరం పాక్ గగనతలం మూసివేసినప్పుడు భారత విమానయాన సంస్థలు సుమారు రూ.700 కోట్లు నష్టపోయిన నేపథ్యంలో, ప్రస్తుత పరిస్థితి కూడా ఆర్థికంగా సవాలుగా మారనుంది

# అర్ధ శతాబ్దం పైగా చరిత్ర గాంధీ విద్యాలయ సొంతం

- సుప్రీం కోర్టు జడ్జి , మంత్రులు ప్రశంసలు
- విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ,ఆధ్యాత్మిక ,క్రీడా శిక్షణలు
- మూడు ఎకరాలు విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణ






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగరంలో అర్ధ శతాబ్దం పైగా చరిత్ర కలిగిన అతి పురాతనమైన విద్యా సంస్థ. 1969 లో జాతిపిత100 వ జన్మదినోత్సవం సందర్భంగా వాసవి పరిషత్ వారి ఆద్వర్యంలో దరిమిలా శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం చే గాంధీ విద్యాలయ సంస్థను నగరం నడిబొడ్డున ఏర్పాటు చేశారు.లాభాపేక్ష కోసం కాకుండా ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని,అప్పట్లోనే ఇంగ్లీషు మీడియం స్కూలు ఏర్పాటు చేశారంటే ముందు చూపు ఎంత ఉందో అర్థం అవుతోంది.విద్యతో పాటు ఆధ్యాత్మిక తరగతులు,కంప్యూటర్ క్లాసు లు , క్రీడలు, యోగ,మెడిటేషన్,సంస్కృత శ్లోకాలు, డ్యాన్స్,డ్రాయింగ్,అబాకస్ క్లాసులు,స్పోకెన్ ఇంగ్లీష్,హ్యాండ్ రైటింగ్ క్లాసులు నిర్వహిస్తూ క్రమశిక్షణ కు ప్రాధాన్యం ఇస్తున్నారు.అధునాతన సౌకర్యాలతో సైన్స్ ల్యాబ్, ఏ సి గదుల్లో కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు.వీటికి తోడు మూడు ఎకరాలు విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ ,విద్యార్థులకు జాతీయ నాయకులు గురించి తెలుసుకునే లా జాతీయ నేతలు విగ్రహాలు ఏర్పాటు చేశారు.

**సుప్రీం కోర్టు జస్టిస్ ప్రశంసలు...** 2020 వ సంవత్సరం ఫిబ్రవరి 15 నాటికి గాంధీ విద్యాలయ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు జస్టిస్ జే చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా , అప్పటి రాష్ట్ర మంత్రి పేర్ని నాని,ఎంపీ బాల శౌరి అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గాంధీ విద్యాలయ నిర్వహణ తీరును ప్రశంసించారు.గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నాలుగు తరగతి గదులు అప్పట్లో పలువురు దాతలు సహకారంతో నిర్మాణం చేశారు.అలాగే ప్రస్తుత రాష్ట్ర మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్ర, ఎంపీ బాల శౌరి,ఏపీ ఎస్ ఆర్టీసీ చైర్మన్ గా ఉన్న కొనకళ్ళ నారాయణరావు,కొనకళ్ళ బుల్లయ్య, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ,మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ ,బండి రామకృష్ణ, లంకిశెట్టి బాలాజీ,నగర ప్రముఖులు గాంధీ విద్యాలయ ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించారు.




**నాడు..నేడు...** శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం ఆద్వర్యంలో నడుస్తున్న ఈ విద్యా సంస్థ విద్యార్థుల్ని అన్ని రంగాల్లో తీర్చి దిద్దేందుకు కృషి చేస్తోంది. గాంధీ విద్యాలయ స్థాపించిన జీ వి గున్నయ్యశెట్టి సెక్రటరీ & కరస్పాండెంట్ గా,కోశాధికారిగా మాజేటి సీతాపతిరావు, గుడివాడ రామచంద్రరావు పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. నేడు సమాజం అధ్యక్షుడు తాడేపల్లి మెహెర్ బాబా, ప్రధాన కార్యదర్శి ఉడత్తు కిషోర్, కోశాధికారి కొప్పర్తి రవిశంకర్,కన్వీనర్ మాజేటి చక్రవర్తి, కో కన్వీనర్ లు గుడివాడ మెహెర్ ప్రకాష్ ,జల్దు భాను ప్రకాష్,పాలకవర్గ సభ్యులు పాఠశాలను మెరుగైన రీతిలో నిర్వహణ చేస్తూ,మంచి ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నారు. లాభాపేక్ష లేకుండా నామ మాత్రపు ఫీజులుతో ,ఉత్తమ ఉపాధ్యాయులు, క్రమశిక్షణ,ప్రణాళికా బద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నారు.ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు.




















Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com